# జవాబు రాని ప్రశ్న

- ఆర్.యం.చిదంబరం.



మూర్తీభవించిన అమాయకత్వం- నక్షత్రాల్లా మెరిసే కళ్లు- వర్ణనాతీతమైన భయం- గౌరవం- అంతరాంతరాల్లో ప్రవహించే అనుబంధం- అనురాగం- ఏమిటో... జగన్నాథం మాస్టారు ఆలోచనా తరంగాల్లో తేలిపోతూ ఎటో చూస్తూ తనలో తాను నవ్వుకున్నారు.

సీతమ్మ రుసరుసలాడుతూ ఆయన ముందు నిలిచింది.

కానీ, మాస్టారు ఆమె రాకను గమనించలేదు. తను సృష్టించిన స్వర్గంలో విహరిస్తూ బాహ్య ప్రపంచానికి దూరమయ్యారు.

'మిమ్మల్నే! లక్షసార్లు పిలిచాను. నా గొంతు బొంగురుపోయింది. కాఫీ చల్లారిపోతోంది. ఇదుగో!' అని స్టూలు మీద ఠపీమని గ్లాసును

పెట్టింది. మాస్టారు దివి నుండి భువికి.

'అరెరె! నా విద్యార్థుల మల్లెపూలలాంటి మనసు గురించి ఆలోచిస్తూ మైమరచిపోయాను.'

'మీరు రిటైరై రెండు సంవత్సరాలు కావస్తోంది. ఇంకా భూతకాలంలోనే బతుకుతున్నారు. మరో పదేళ్లు ఇలానే దొర్లిపోతాయి. పెళ్లీ పెటాకులూ లేకుండా అమ్మాయి ముప్పై ఏళ్ల ముసిల్దయి కూర్చుంటుంది. అప్పుడు దాని పెళ్లి గురించి ఆలోచిద్దురు కానీ.'

సీతమ్మ విరుచుకుపడింది.

'నా మతిమరుపు మండ. నీకు చెప్పటం మర్చిపోయాను. మన భీమశంకరం నిన్ననే కనిపించి మంచి కబురు తీసుకువచ్చాడు. అతని బంధువులకు తెలిసిన ఓ అబ్బాయికి, చదువు, సంస్కారం, నమ్రత అన్నీ వున్న భార్య కావాలిట. అంతేకాదు– సంగీతమంటే చెవి కోసుకుంటాడు. అంటే అతని రూపకల్పనకు మన సుశీల సరైన ప్రతిబింబం. అతనికి 'నా' అనేవాళ్లెవరూ లేరట. వేలువిడిచిన మేనమామ తప్పించి– అబ్బాయి ఓ పెద్ద కంపెనీలో మేనేజరుగా పనిచేస్తున్నాడట. స్వంత ఇల్లు, డ్రైవరుతో సహా కారు– అన్నీ వున్నాయి. శంకరం పెళ్లి చూపులకు ఏర్పాటు చేస్తానంటాడు. మరి నీ అభిప్రాయం?'

సీతమ్మ గట్టిగా నిట్టూర్చింది. ఇలాంటి పెళ్లి సంబంధాల గురించి మాస్టారి నోట వెంట వినడం ఇది మొదటిసారి కాదు– ఎవరో ఏదో అంటారు. వెంటనే ఆయన సంతోషంతో చిన్నపిల్లాడిలా గెంతులేస్తూ తలక్రిందులుగా నడుస్తారు. మాస్టారు సీతమ్మ సమాధానం కోసం వేచివుండలేదు.

'అయితే ఓ చిన్న చిక్కు. ఇంకో నెల రోజుల్లో అతను అమెరికా వెళ్లిపోతాడట. ఆ తరువాత కనీసం మూడు సంవత్సరాలకు తిరిగి రాడు. అందుకని పెళ్లి వెంటనే జరపాలిట.'

'మరి లాంఛనాలు?'

'వరదక్షిణ సంగతా? నువ్వింకా పద్దెనిమిదో శతాబ్దంలో వున్నావు. అతని కోరిక ఒక్కటే. పెళ్లి మాత్రం ఘనంగా జరపాలి.'

'మరి పెళ్లి ఖర్చులకు ఏం చేద్దామని?' సీతమ్మ ఎదురు ప్రశ్న వేసింది.

'చలంతో మాట్లాడాను. మనం ఫైనాన్స్ కంపెనీలో లక్ష రూపాయలు డిపాజిట్ చేశాం. జ్ఞాపకం వుందా?'

'కానీ అది మూడు సంవత్సరాల డిపాజిట్. కాలవ్యవధి పూర్తికాకుండా ఎలా తిరిగిస్తారు?'

'ఆ సంగతే చలంతో ప్రస్తావించాను. అత్యవసర పరిస్థితుల్లో మన డబ్బు తిరిగి ఇస్తారట. కొంత కోతబడి వుంటుందనుకో.'

అలా సంభాషణ కొనసాగుతుండగా చలంగారు వచ్చారు.

మాస్టారూ, ఆయనా బాల్య స్నేహితులు. ఒకే స్కూల్లో చదువుకున్నారు. జగన్నాథం ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్నారు. చలం సెక్రటేరియట్‌లో గుమాస్తాగా చేరి సూపరింటెండెంట్‌గా రిటైరయ్యారు. ఆయన మాట మాస్టారికి లక్ష్మణ రేఖ. చలం మాట మీద ఎవరెస్టంత నమ్మకం.

రెండు సంవత్సరాల క్రితం రిటైరైన మాస్టారికి మూడు నెలల్లో ప్రావిడెంటు ఫండ్, గ్రాట్యుటీ అన్నీ అందాయి. అందరూ ఆశ్చర్యంతో ముక్కుమీద వేలేసుకున్నారు. కనీసం ఓ సంవత్సరంపాటు చెప్పులరిగేటట్టు తిరుగుతూ, ప్రావిడెంటు ఫండ్ ఆఫీసులో ఫ్యూన్ దగ్గర్నుంచి ఆఫీసరుదాకా అందరికీ దండాలు పెడుతూ, పళ్లికిలిస్తూ అప్పుడప్పుడూ పదో పరకో పారేయాలి. అప్పటికి కానీ 'స్వంత డబ్బు' చేతికందదు. మొత్తంగా ఆయనకు లక్షన్నర రూపాయలు ముట్టాయి.

'ఈ డబ్బు ఎలా ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నావు?' చలం అడిగారు.

'ఏదైనా బ్యాంకులో డిపాజిట్ చేస్తాను. అది సురక్షితం.'

'నువ్వింకా త్రేతాయుగంలో వున్నావు సుమా! బ్యాంక్ వాళ్లు ఏం వడ్డీ ఇస్తారు? పదేళ్లు డిపాజిట్ చేస్తే పది శాతం వడ్డీ ఇస్తారు. పెద్ద పెద్ద కంపెనీలు ఆర్థికంగా దెబ్బతిన్నాయి. అందుచేత కంపెనీ డిపాజిట్ల వంక ఓరకన్నుతో కూడా చూడకు.

ఇప్పట్లో మనకు లాభదాయకం- ఫైనాన్స్ కంపెనీలు.'

'వద్దు బాబూ! వడ్డీ మాట దేవుడెరుక. అసలే తిరిగిరాదు' అన్నారు మాస్టారు భయంభయంగా.

'అన్ని ఫైనాన్స్ కంపెనీలను ఒక దృష్టితో చూడకూడదు. ఉదాహరణకు- కైలాసం ఫైనాన్స్ తీసుకో. నేను రిటైరవగానే వచ్చిన పైకం పూర్తిగా ఆ కంపెనీలో నిలవేశాను. ఇప్పటికి మూడు సంవత్సరాలైంది. ఇరవై శాతం వడ్డీ. అంతేకాదు- ప్రతి దీపావళికి ఓ బహుమతి. క్రిందటి సంవత్సరం టి.వి. సెట్ ఇచ్చారు. ఆ క్రిందటి సంవత్సరం ఫ్రిజ్ ఇచ్చారు. ఇంతకంటే నీకేం కావాలి. ఇంక ఆలోచించకు. శుభస్య శీఘ్రం!' అని సలహా ఇచ్చారు.

ముందే చెప్పాను- చలంగారి మాటకు తిరుగులేదు. తల నిలువునా ఆడించారు.

'నేను ఫోన్ చేసి కంపెనీ ప్రతినిధిని రమ్మంటాను. నేనూ నీ దగ్గరే వుంటాను. భయపడకు.'

ఆ మర్నాడు మధ్యాహ్నం కైలాసం కంపెనీ ఆఫీసరు కారులో వచ్చాడు. కొన్ని ఫారాల మీద దంపతులిద్దరి సంతకాలు తీసుకున్నాడు. చలంగారు సాక్షిగా సంతకం పెట్టారు. వీడ్కోలు తీసుకునేటప్పుడు కరచాలనం చేస్తూ బంగారు పూత వున్న ఓ 'క్రాస్' పెన్ బహూకరించి వెళ్లాడు.

'నిజంగా నీ ఫైనాన్స్ కంపెనీ కైలాస పర్వతం లాంటిదోయ్. ఇంత మంచి సలహా ఇచ్చినందుకు నీకెలా కృతజ్ఞత చెప్పాలో తెలియటం లేదు. మాస్టారు సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు.

సరిగ్గా మూడు నెలలు తిరిగేసరికి వడ్డీ తాలూకు 'చెక్' వచ్చింది. దీపావళికి ఫ్రిజ్ కానుక.

'జగన్నాథం! కంపెనీకి నీ డబ్బు తిరిగి కావాలని దరఖాస్తు పడేశావా?'

'అవును... పదిరోజులైంది. ఎలాంటి జవాబూ రాలేదు. ఫోన్ చేస్తే ఆ సెక్షన్ ఆఫీసరు సెలవు మీద వున్నాడట. అతను వచ్చాక శాంక్షన్ అవుతుందట. మరెలాగ! భీమశంకరం తొందరపెడుతున్నాడు. అవకాశం జారిపోకూడదు కదా!'

'నాదొక చిన్న సలహా. తిన్నగా ఆ కంపెనీకి వెళ్లు. బస్సులో ఓ గంట ప్రయాణం. అంతే, ఆఫీసర్ని కలుసుకుని అమ్మాయి పెళ్లికి డబ్బు అర్జంటుగా కావాలని అడుగు. నీ పని అవుతుంది. నేనూ వచ్చేవాణ్ణి- కానీ మధ్యాహ్నం విజయవాడదాకా వెళ్లాలి.'

ఆ తరువాత సుశీల పెళ్లిక్కావలసిన ఏర్పాట్ల గురించి మాట్లాడుకున్నారు.

❖ ❖ ❖

అది ఇరవై అంతస్థుల భవనం. లిఫ్ట్ కోసం ఇరవై నిముషాలు 'క్యూ'లో నిలబడి కైలాసం ఫైనాన్స్ కంపెనీ ఆఫీసు చేరుకున్నారు. సెక్షన్ ఆఫీసరు ఎ.సి. గదిలో సుఖాసీనుడై ఏవో ఫైళ్లు పరిశీలిస్తున్నాడు. మాస్టార్ని చిరునవ్వుతో ఆహ్వానించి కూల్‌డ్రింగ్ తెప్పించాడు.

'మాస్టారూ! మీ అప్లికేషన్ పాసైంది. కానీ దురదృష్టవశాత్తూ మా కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు గారు అర్జంటు పని మీద ముంబై వెళ్లారు. రెండు రోజుల్లో వచ్చేస్తారు. చెక్కు మీద ఆయన సంతకం కావాలి. అంతదాకా ఓపిక పట్టండి. మేమే

## కాలం క్షణకాలం ఆగదు

కాలం క్షణకాలం ఆగదు
కాలం దుర్నివారం
కాలం దూరం తెలియని
అపార పారావారం
క్షణాలు దినాలు
పక్షాలు మాసాలు
సంవత్సరాలు యుగాలు
కల్పాలు కల్పాంతరాలు
చరచరా సాగిపోతున్నాయి
గిరగిరా తిరిగిపోతున్నాయి
కాలం అజేయం
కాలం అమేయం

\- వై.కె.మూర్తి.

స్వయంగా మీ ఇంటికి వచ్చి 'డ్రాఫ్ట్' అందజేస్తాం. మీకు శ్రమ కలిగించినందుకు క్షమించండి. మా కంపెనీలో ఇలా ఎన్నడూ జరగలేదు.'

మాస్టార్ని సాగనంపుతూ ఓ వెండి 'కీ చెయిన్' బహూకరించాడు.

జగన్నాథం గారు వడివడిగా బస్‌స్టాండ్ వైపు నడుస్తున్నారు. వెనక నుంచి 'మాస్టారూ!' అన్న పిలుపు విని ఆగి వెనక్కి తిరిగి చూశారు. ఓ యువకుడు నవ్వుతూ 'నమస్కారం మాస్టారూ... బాగున్నారా!' అని వినయంగా అడిగాడు. చూడటానికి మనిషి గంభీరంగా వున్నాడు. అయస్కాంతం లాంటి కళ్లు- సూటు వేసుకుని 'టిప్-టాప్'గా వున్నాడు.

'ఈ అబ్బాయిని నేను ఎక్కడో చూశాను' బాగా పరిచయమైన వ్యక్తిలా కనిపిస్తున్నాడు. కానీ... ఎవరతను?' అనుకున్నారు.

'నాయనా! నువ్వెవరో నాకు గుర్తుకు రావటం లేదు.'

'నన్ను చూసి కనీసం పది సంవత్సరాలు దొర్లిపోయాయి కదా మాస్టారూ!'

అదీకాక ముతక ప్యాంటు, చొక్కా వేసుకున్న ఆ కుర్రాడికీ, ఈ క్షణం మీ ముందు నిలబడివున్న యువకుడికీ ఏమాత్రం పోలికలు లేవు' అని నవ్వాడు.

మాస్టారి మెదడులో ఓ మెరుపు మెరిసింది.

'హరి పిడుగా! నువ్వట్రా... రమణా! నిన్నిలా చూస్తుంటే గర్వంగా వుందిరా. నాకు తెలుసు. స్వయంకృషి వలన నువ్వు ముందుకొస్తావని. ఇప్పుడేం చేస్తున్నావు? ఎక్కడుంటున్నావు?'

'అదంతా కాస్త కాఫీ తాగుతూ తాపీగా మాట్లాడుకుందాం. రండి! ఆ రెస్టారెంటుకు పోదాం.'

ఎ.సి. గదిలో కూర్చుని రమణ వివరాలు చెప్పాడు. స్కూలు ఫైనల్ పూర్తయిన తరువాత కాలేజీ చదువు ముగించి, ఎం.బి.ఏ. పాసై ఓ కంపెనీలో చేరాడు. కష్టపడి పనిచేసి ఆ కంపెనీలో ఉన్నత స్థాయిలో స్థిరపడ్డాడు. ఇప్పుడతను ఆ కంపెనీ మేనేజరు. అన్ని వసతులూ వున్నాయి.

'మాస్టారూ! నా తల్లిదండ్రులు చిన్నతనంలో పోగానే నేను అనాథనైపోయాను. మీరు నన్ను చేరదీసి చదివించారు. లేకపోతే ఏ హోటల్లోనైనా సర్వర్‌గా వుండేవాడిని. మీ రుణం ఎలా తీర్చుకోగలను?'

కన్నీళ్లు జలపాతంలా వచ్చాయి.

'పిచ్చివాడా! ఎవరు ఎవరికి రుణపడటం? మానవుడిగా నా కర్తవ్యాన్ని నెరవేర్చాను. అంతేకానీ మహాత్ములకు మల్లే ఎలాంటి త్యాగాలూ చేయలేదు. నువ్వు జీవితంలో ఇంత చిన్న వయస్సులో శిఖరాన్నందుకున్నావు. అదే నువ్వు నాకిచ్చే పారితోషికం.'

'సుశీలగారు ఎలా వున్నారు?'

'గారేమిట్రా? నీకంటే వయస్సులో అయిదు సంవత్సరాలు చిన్నది. సుశీల అనే పిలవాలి. బాగానే వుంది. సంగీతం నేర్చుకుని చిన్న చిన్న కచేరీలు కూడా చేస్తోంది. దాని పెళ్లి ఖాయమయ్యేటట్టుంది. నీ అడ్రస్ కావాలి. శుభలేఖ పంపుతాను. నువ్వు పెళ్లికి తప్పకుండా రావాలి. అంతేకాదు, వీలైనప్పుడు ఇంటికి రా! నిన్ను చూసి అందరూ సంతోషిస్తారు.'

'ఇప్పుడే నాకూడా వచ్చేయకూడదూ?'

'అంతకంటే మహాభాగ్యం ఏముంది? కొన్ని పని తొందరల వల్ల ఇప్పుడు రావటం వీలుపడదు. కానీ తప్పకుండా వస్తాను. కనీసం ఉత్తరమైనా రాస్తాను' అని సెలవు తీసుకున్నాడు.

మాస్టారు నవ్వుకున్నారు. ఈ అనంత విశ్వంలో తను ఒక అణుమాత్రం కుళ్లు- కపటం- అహంకారం- అసూయ- దురాశ- వీటితో సతమతమవుతున్న మానవుల్లో కృతజ్ఞతాభావానికి చోటు లేదు. కానీ రమణ తీరు వేరుగా వుంది. అతను చదువుకోవడానికే తాను చేసిన అల్పసహాయాన్ని కొండంతగా పొగడుతున్నాడు. 'మంచి కుర్రాడు' అనుకున్నారు.

❖ ❖ ❖

రెండు రోజులు దొర్లిపోయాయి. మాస్టారు డబ్బు కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. చలం పరిగెత్తుకొచ్చారు. ముఖం పాలిపోయి కళ్లు రెండూ

ఎర్రగా వున్నాయి. చేతులూ, కాళ్లూ వణుకుతున్నాయి.

'కూర్చో చలం! ఏమైంది? ఒంట్లో బాగాలేదా?'

మాస్టారికి భయంగా వుంది. ఏదో జరగకూడనిది జరిగి వుంటుంది. స్థితి గమనించి సీతమ్మ గ్లాసులో మంచినీళ్లు తీసుకొచ్చింది. ఓ నిమిషం నిశ్శబ్దం... మాస్టారికంతా అయోమయంగా వుంది. ఉన్నట్టుండి చిన్నపిల్లాడిలా చలం బావురుమన్నారు.

'అసలు సంగతి చెప్పు... ఇలా ఏడిస్తే నాకేం తెలుస్తుంది? ప్రశాంతంగా ఆలోచించి చీకటిలో దీపం వెలిగించవచ్చు' అన్నారు మాస్టారు.

'జగన్నాథం! కొంప మునిగింది. నువ్వు పేపరు చదవలేదా? మనం సర్వనాశనమైపోయాం. మన ఫైనాన్స్ కంపెనీ మూసేశారు. పోలీసులు ఆఫీసు సీలు చేశారు.'

మాస్టారికి కూడా ఓ క్షణం గుండె ఆగినట్టయింది. అయినా నిలదొక్కుకున్నారు. ముందు చలాన్ని ఓదార్చి ఆశాకిరణాలు సంపూర్ణంగా అదృశ్యం కాలేదని ధైర్యం చెప్పాలి.

'అనవసరంగా భయపడకు- అది మనం చెమటోడ్చి సంపాదించిన సొమ్ము. మనం జీవితంలో ఎవరినీ మోసగించలేదు. నేను ఆ కంపెనీకి వెళ్లి వివరాలు కనుక్కొస్తాను. నువ్వు ఆత్మవిశ్వాసం కోల్పోకూడదు. నువ్విక్కడే వుండు. వదినను కూడా ఇక్కడే వుండమంటాను. సీతమ్మ తోడుగా వుంటుంది' అని వెంటనే బస్టాండుకు బయలుదేరారు.

మాస్టారు ఫైనాన్స్ కంపెనీ చేరుకునేసరికి పన్నెండు దాటింది. తనలాగే కష్టపడి సంపాదించిన డబ్బును డిపాజిట్ చేసిన రెండు వందలకుపైగా నిరాశాపరులు కనిపించారు. అందరూ దిగులుగా కూలబడి శూన్యంలోకి చూస్తున్నారు.

'ఏమైంది?' అనడిగారు మాస్టారు వాళ్ల మధ్య చతికిలబడుతూ.

'ఇంకేముంది? కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు, తదితర పెద్ద పీనుగలు మిగిలిన డబ్బంతా తీసుకుని పరారీ అయిపోయారు.'

'అయితే మనం ఏం చేయాలి?' మాస్టారు అమాయకంగా ప్రశ్నించారు.

'పంగనామాలు వేసుకోవాలి- మొహం కూడా కనిపించనంత పెద్దదిగా' అన్నాడొక అనామకుడు కసిగా.

ఓ గంటసేపు ఆ గుంపు మధ్యన కూర్చుని మాస్టారు దిగాలుగా తిరిగి వచ్చారు.

ఇంటికి రాగానే అందిన వార్త- చలానికి గుండెపోటు వచ్చి హాస్పిటల్లో చేర్పించారు. ఆయన స్థితి ప్రమాదకరంగా వుందన్నారు. జగన్నాథంగారు తన దగ్గరున్న కొద్దో గొప్పో డబ్బు తీసుకుని హాస్పిటల్ చేరుకున్నారు. ఐ.సి.యు.లో జీవచ్ఛవంలా పడివున్న తన ప్రియ స్నేహితుణ్ణి చూసి ఆయన కృంగిపోయారు. బయటివారికి గంభీరంగా కనిపించినా లోలోన ఆయన పడుతున్న మధనం ఆయనకు మాత్రమే తెలుసు.

ఆ మర్నాడు కొరియర్‌లో మాస్టారికి ఓ ఉత్తరం వచ్చింది.

'పూజ్యులైన గురువు గారికి... నమస్కారం! నేనే రమణను. మీకీ ఉత్తరం రాస్తున్నా. ఏ పరిస్థితిలోనైనా అబద్ధమాడకూడదు. నిజమే పలకాలి. ఇది మీ దగ్గర్నుంచి నేను నేర్చుకున్న మొదటి పాఠం. కానీ నిజజీవితంలో ఈ సూత్రాన్ని పాటించలేక ఓడిపోయాను. కైలాసం ఫైనాన్స్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టరు ఇంకెవరో కాదు- నేనే. కానీ ఆ కంపెనీ ప్రారంభించినపుడు నాలో ఎలాంటి దురుద్దేశమూ లేదు. బ్యాంకులు, తదితర సంస్థల కంటే ఎక్కువ వడ్డీ ఇచ్చి ఆర్థికంగా చితికిపోయిన వారికి సాయం చేయాలనే లక్ష్యంతోనే ఈ కంపెనీ ప్రారంభించాను. కానీ సూటిగా వెళ్లక, వక్ర మార్గంలో నడవక తప్పలేదు. నేను ఆశించినట్టు నా ప్రణాళికలు ఏవీ వెలుగును చూడలేకపోయాయి. అందరి దగ్గర తీసుకున్న డిపాజిట్లు 'రీ ఇన్వెస్ట్' చేసి నష్టపోయి సుడిగుండంలో చిక్కుకున్నా. ఈ పరిస్థితుల్లో పరారీ కావడం తప్పించి నాకు వేరే మార్గం

కనిపించలేదు. నాకు తెలుసు- పోలీసులు, న్యాయస్థానం ఎప్పుడో ఒకప్పుడు నన్ను కటకటాల వెనక్కి నెట్టేస్తారని.

మీరు మా కంపెనీలో డిపాజిట్ చేసిన లక్ష రూపాయలు నా దృష్టిలో కోటి రూపాయలకు సమానం. మీరూ, సీతమ్మగారూ ఎంత కష్టపడి పొదుపు చేశారో నాకు తెలుసు- అందులో ప్రతి ఒక్క రూపాయి మానవత్వానికి ప్రతిబింబం. అందుచేత ఈ ఉత్తరంతోపాటు లక్ష రూపాయలకు 'డ్రాఫ్ట్' పంపుతున్నాను. సుశీల పెళ్లి వైభవంగా జరిపించండి. నేను పెళ్లికి రాలేకపోయినా, నా శుభాకాంక్షలు పుష్పవర్షంలా అక్కడ కురుస్తాయి.

ఇంకో నిజం- ఇది చదివి మీరు స్థాణువైపోతారు. సుశీలను చూడటానికి రానున్న పెళ్లికొడుకును నేనే. భీమశంకరంగారు మీ దగ్గర పేర్కొన్న ఆ దురదృష్టవంతుణ్ణి నేనే. పూర్వజన్మ సుకృతం అనండి- మరేదైనా అనండి- సుశీల ప్రమాదం నుంచి బయటపడింది.

మీరు నన్ను క్షమించరని నాకు తెలుసు. అందుకని ఆ కోర్కెను అణచి వుంచాను.'

– రమణ.

సీతమ్మ అడిగింది- 'ఎవరండీ ఆ ఉత్తరం రాసింది?'

'ఇంకెవరు? ఆ కంపెనీవాళ్లే. రెండు రోజుల్లో మన డబ్బు తిరిగి ఇస్తామని...' అని మాస్టారు విషాదంగా నవ్వారు. మొదటిసారిగా ఆయన అబద్ధమాడారు- అదీ ధర్మపత్నితో.

❖ ❖ ❖

చలం హాస్పిటల్ నుంచి తిరిగి వచ్చారు. ఉరిత్రాడులా బిగుసుకుపోయిన యమపాశం ఆయన్నేమీ చేయలేకపోయింది. ఓటమిని ఒప్పుకోవడం ఇష్టంలేక ఆయన్ని మూగవాణ్ణి చేసిపోయింది. ఏదన్నా చెప్పాలనుకుంటే కాగితం మీద రాసి చూపించాలి.

జగన్నాథంగారు చలం పేరనున్న లక్ష రూపాయల 'డ్రాఫ్టు' అందించారు.

'ఇది ఎవరిచ్చారు?' అని ప్రశ్నించారు చలం- కాగితం మీద.

'కైలాసం ఫైనాన్స్ కంపెనీవాళ్లు' అన్నారు. ఇది రెండో అబద్ధం.

'ఇదే మరొకరిస్తే నేను నమ్మను. కానీ నువ్వు నిజాయితీకి తోబుట్టువు. అబద్ధమంటే ఆమడ దూరం పారిపోతావు. అందుచేత నమ్ముతున్నాను.'

మాస్టారు ముభావంగా నవ్వి- 'నువ్వు పూర్తిగా కోలుకోవాలి త్వరగా మరి- సుశీల పెళ్లి దగ్గరపడుతోంది' అన్నారు.

మునన్పందనగా చలం చేతులెత్తి నమస్కరించారు.

కానీ మాస్టారి మనసులో నిలిచిపోయిన జవాబురాని ప్రశ్న- 'చలం నా మాటలు నమ్మాడా?'.

❖ ❖ ❖


## 'పత్రిక' చందా వివరాలు

కొందరు 'పత్రికా'భిమానులు చందా వివరాలు కావాలని ఉత్తరాలు రాస్తున్నారు. అలాంటి వారి కోసం-

| | |
|---|---|
| **పత్రిక విడిప్రతి** | **: 5/-** |
| **ప్రత్యేక సంచిక (ఉగాది,దీపావళి)** | **: 10/-** |
| **సాలుసరి చందా** | **: 60/-** |

మీ ఏడాది చందాను మోనికా పబ్లికేషన్స్ పేరిట ఎం.ఓ. లేదా హైదరాబాద్‌లో చెల్లించే విధంగా డి.డి. ద్వారా పంపండి! ప్రత్యేక సంచికలకు, పోస్టల్ ఛార్జీలకు కాగల అదనపు వ్యయాన్ని చందా మొత్తంలో చేర్చడాన్ని పాఠకులు గుర్తించగలరు. దీనిని ప్రత్యేక రాయితీగా పరిగణించి, చందా మొత్తాన్ని వెంటనే ఈ క్రింది అడ్రసుకు పంపగలరు.

**మోనికా పబ్లికేషన్స్**

79బి, జర్నలిస్ట్స్ కాలనీ,

జూబ్లీహిల్స్, హైదరాబాద్-33.